RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను


జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 275 | సోమవారం 05 - 05 - 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు : 08 | వెల : 2 రూ/-

## నైట్ క్లబ్బుల్లోనే ఎక్కువగా కనిపిస్తున్నారు

### ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్‌పై మాజీ అధికారి సంచలన ఆరోపణలు



- ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్‌పై మాజీ అధికారి ఫ్రాంక్ ఫిగ్లియుజ్జి విమర్శలు
- విధుల కన్నా నైట్‌క్లబ్‌లకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారని ఆరోపణ
- రోజువారీ బ్రీఫింగ్‌లను వారానికి రెండుకు కుదించారని వ్యాఖ్య
- వనరుల దుర్వినియోగంపై విచారణ చేయాలని డెమోక్రాట్ల నుంచి డిమాండ్

## కేదార్‌నాథ్ ఆలయానికి తొలిరోజు పోటెత్తిన భక్తులు..

### 30వేల మందికి పైగా భక్తుల దర్శనం



- శుక్రవారం ఉదయం తెరచుకున్న కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు
- నిన్న ఒక్కరోజే రికార్డుస్థాయిలో 30 వేల మందికిపైగా భక్తుల దర్శనం
- ఇందులో 19,196 మంది పురుషులు.. 10,597 మంది మహిళలు.. 361 మంది ఇతరులు

2లో

## పాక్‌కు మరో షాక్.. ఆ దేశం నుంచి దిగుమతులపై నిషేధం



- పాక్ ఓడలు రావొద్దు..
- పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతులపైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి
- పాకిస్థాన్ నుంచి చేసుకునే ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై తక్షణమే నిషేధం విధిస్తున్నట్లు భారత వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రకటించింది.

## కవితతో 20 ఏళ్ల స్నేహం.. నందమూరి అలేఖ్య ఎమోషనల్ పోస్ట్!



- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో తనకున్న స్నేహంపై నందమూరి అలేఖ్య పోస్టు
- తమ స్నేహానికి 20 ఏళ్లు పూర్తయ్యాయని, బంధం మరింత బలపడిందని వెల్లడి
- ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా తమ స్నేహం చెక్కుచెదరలేదన్న అలేఖ్య

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది

- కొత్త రేషన్ కార్డుల జారీ పైన స్పష్టత ఇచ్చింది
- పౌర సరఫరాల శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది
- కొత్తగా రేషన్ లబ్ది దారులకు సన్న బియ్యం పంపిణీ మొదలైంది
- కొత్తగా 11 లక్షల మంది రేషన్ లబ్దిదారులుగా అర్హత పొందారు

## రేషన్ కార్డు లబ్దిదారులకు బిగ్ అప్డేట్ - ప్రభుత్వ తాజా నిర్ణయం..!!



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త రేషన్ కార్డుల జారీ పైన స్పష్టత ఇచ్చింది. ఎంతో కాలంగా కార్డుల్లో పేర్లు మార్పు.. కొత్తగా చేర్పుల పైన లబ్ది దారులు వేచి చూస్తున్నారు. ఈ అంశం పైన మిగతా 2లో..



వివరాలు 2లో..

## తెలంగాణలో 33 జిల్లాలకు గాను 32 జిల్లాలమీదుగా జాతీయ రహదారులు వెళుతున్నాయి: కిషన్ రెడ్డి

- గత పదేళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల పొడవు రెట్టింపు
- 2,500 కి.మీ నుంచి 5,200 కి.మీకి పెరిగిన జాతీయ రహదారులు
- రహదారుల అనుసంధానానికి మోదీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత
- హైదరాబాద్-శ్రీశైలం, విజయవాడ మార్గాల విస్తరణకు ప్రణాళికలు

హైదరాబాద్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో తెలంగాణలో జాతీయ రహదారుల నిర్మాణం వేగవంతం చేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రహదారుల అభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. గత దశాబ్ద కాలంలో తెలంగాణలో జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2014 నాటికి తెలంగాణలో కేవలం 2,500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉండగా,



## పహల్గామ్ ఉగ్రదాడి గురించి అమెరికాకు తెలుసు.. నివేదిక ఉంది: కేఏ పాల్

- ఉగ్రదాడి గురించి పూర్తి సమాచారం అమెరికా ఇంటెలిజెన్స్ వద్ద ఉందన్న పాల్
- ఎవరు దాడి చేశారు, ఎందుకు చేశారో నివేదికలో ఉందని వ్యాఖ్య
- ఈ దాడి ఎవరి కొరకు చేశారో కూడా ఉందన్న పాల్

## ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు



## సీఎం రేవంత్ 42సార్లు ఢిల్లీ వెళ్లి చేసిందేంటి

- 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌పై హరీశ్‌రావు విమర్శలు
- కేంద్రం ఉపాధి పనిదినాల్లో రాష్ట్ర కోటాను సగానికిపైగా తగ్గించిందని ఆగ్రహం
- ముఖ్యమంత్రి 42 సార్లు ఢిల్లీకి వెళ్లిన ప్రయోజనం లేదని మండిపాటు
- విషయం తెలిసినా రాష్ట్రంలోని కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉన్నారంటూ ఫైర్

హైదరాబాద్ : సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రం ఉపాధి పనిదినాల్లో రాష్ట్ర కోటాను సగానికిపైగా తగ్గించిందని,



## మోదీ తీరు చూస్తే చిచ్చుబుడ్డి తుస్సుమంది అనక తప్పదు

- మోదీ అమరావతికి మట్టి, సున్నమే ఇచ్చారన్న ఏపీసీసీ చీఫ్
- విభజన హామీలపై ప్రధాని స్పష్టత ఇవ్వలేదని అసంతృప్తి
- కేంద్రం నిధులు తేలేని చంద్రబాబు ప్రజలపై అప్పుల భారం మోపుతున్నారని విమర్శ



వివరాలు 2లో..

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి నిధుల విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. విభజన చట్టం ప్రకారం

## 4.80 కోట్లతో నూతన ఆర్టీసీ బస్టాండ్ శంకుస్థాపన





**ములుగు, తెలంగాణ సేన న్యూస్ :** ములుగు ప్రజల దశాబ్దాల కల నెరవేర్చాం గ్రామ గ్రామానికి రవాణా సౌకర్యం కల్పించా హైటెక్ తరహాలో ఆరు నెలలో బస్టాండ్ ఏర్పాటు చేయడానికి చర్యలు.ప్రజల అభిప్రాయం మేరకే ప్రజా పాలన కొనసాగింపు.రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.ములుగు జిల్లా కేంద్రంలో 4.80 కోట్లతో నూతన ఆర్టీసీ బస్ స్టేషన్ కి శంకుస్థాపన చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క..ములుగు జిల్లా ప్రజల దశాబ్దాల కళ జిల్లా కేంద్రంలో నూతన బస్టాండ్ ఏర్పాటుతో నెరవేర్చబోతున్నామని, హైటెక్ తరహాలో నూతన బస్టాండ్ ను ఆరు నెలల లోపు పూర్తి చేసి ప్రారంభించడం జరుగుతుందని రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలన్నింటికీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు.ఆదివారం జిల్లా కేంద్రంలో , రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. లతో కలిసి నాలుగు కోట్ల 80 లక్షల రూపాయలతో చేపట్టనున్న నూతన బస్టాండ్ నిర్మాణ పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు.జిల్లాకు చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం గట్టమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రులు భారీ ర్యాలీగా జిల్లా కేంద్రానికి చేరుకోగా అభిమానులు గజమాలతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజల అభిప్రాయం మేరకే ప్రజా పాలన ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెడుతుందని, తాము ఇచ్చిన హామీలను కాకుండా నూతన పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ 1989 లో నిర్మించగా ప్రస్తుతం బస్టాండ్ పరిస్థితి బాగాలేదని సోదరీమణి సీతక్క తెలుపగానే నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు కేటాయించామని, మంగపేట మండలంలో 50 లక్షల రూపాయలతో నూతన బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తి అవుతున్నాయని అన్నారు. రానున్న రోజులలో మంగపేట మండల కేంద్రంలోని నూతన బస్టాండును ప్రారంభించడమే కాకుండా ఏటూరు నాగారం మండల కేంద్రంలో ఏడు కోట్ల రూపాయలతో చేపట్టనున్న బస్ డిపో పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని వివరించారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రేమనగర్ వద్ద గిరిజన యూనివర్సిటీ, సమీకృత కలెక్టరేట్ కార్యాలయం, వైద్య కళాశాల ఉన్న కారణంగా ఎకరం స్థలంలో 45 లక్షల రూపాయలతో నూతన బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. మహిళలను ఆర్థికంగా బలోపితం చేయడానికి మహిళా సంఘాల వారిచే 600 బస్సులను కొనుగోలు చేసి బస్సు యజమానులుగా చేశామని, ములుగులో చేపట్టనున్న నూతన బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టిన ప్రగతిని ప్రతినెల అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్ గా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని, రాష్ట్రంలో తాము కుల గణన చేయడంతోనే కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి దేశవ్యాప్తంగా కులగనన చేయడానికి ముందుకు వచ్చిందని, దీనిపై కేంద్ర మంత్రులు రాద్ధాంతం చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ములుగు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి మంత్రి సీతక్క చొరవ చూపడం అర్శించదగ్గ విషయమని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు ప్రాంతం ఒకప్పుడు గ్రామీణ ప్రాంతంగా అనంతరం మండల ప్రాంతంగా జిల్లా ప్రాంతంగా ఏర్పడిన అనంతరం ములుగు గ్రామపంచాయతీని మున్సిపాలిటీగా ప్రభుత్వం గెజిటెడ్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ములుగు జిల్లాలో పలు ప్రాంతాలలో నూతన బస్టాండ్ నిర్మాణ పనులు చేయడానికి నిధులు కేటాయించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి నేడు రాష్ట్రంలో బీసీల పాలిట దేవుడు గా మారి 42 శాతం రిజర్వేషన్ సాధించడం గొప్ప విషయమని, జిల్లా కైంద్రాన్ని రోల్ మాడల్ గా తీర్చిదిద్దడానికి రానున్న రోజులలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ములుగు ప్రాంతం పర్యాటక ప్రాంతంగా మారడంతో ఎలాంటి పనులకైనా రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నిధులు కేటాయిస్తున్నారని, మిస్ వరల్డ్ కార్యక్రమంలో భాగంగా సుందరిమణులు రామప్పను సందర్శించనున్న దృశ్య ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. నూతన బస్టాండు నిర్మాణంతో ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోనున్నాయని హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ గారు జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాల్మన్ రాజ్, డిప్యూటీ ఆర్ ఎం ఓ భాను కిరణ్, ఆర్డీవో వెంకటేష్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కర్, డిపో మేనేజర్లు జ్యోత్స్న, రవి చందర్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నాది బాధ్యత, మోదీకి చంద్రబాబు హామీ - మిషన్ 2029..!!



అమరావతి : అమరావతి కేంద్రంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధాని మోదీ అమరావతి కేంద్రంగా సీఎం చంద్రబాబుకు బిగ్ టాస్క్ అప్పగించారు. అమరావతి నిర్మాణానికి కేంద్రం నుంచి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఏపీ భవిష్యత్ లో అమరావతి పాత్ర కీలకం కానుందని ప్రధాని పేర్కొన్నారు. సభ సక్సెస్ కావటంతో కూటమి నేతలు ఖుషీ అవుతున్నారు.

## నెలకు రూ.60 వేల జీతం... జాబ్ నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం




- ఆంధ్రప్రదేశ్ ప్రణాళికా శాఖలో 175 యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టులు
- కాంట్రాక్టు పద్ధతిలో ఏడాది కాలానికి నియామకం
- ఎంబీఏ లేదా పీజీ ఉత్తీర్ణత అర్హత
- ఎంపికైన వారికి నెలకు రూ.60,000 వేతనం

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్ర ప్రణాళికా శాఖలో ఖాళీగా ఉన్న 175 యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టులను కాంట్రాక్టు మిగతా 2లో..

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సోమవారం 05 - 05 - 2025

## నైట్ క్లబ్బుల్లోనే ఎక్కువగా కనిపిస్తున్నారు
## ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్‌పై మాజీ అధికారి సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ : అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్ కాష్ పటేల్‌పై ఆ సంస్థ మాజీ ఉన్నతాధికారి ఫ్రాంక్ ఫిగ్లియుజ్జి సంచలన ఆరోపణలు చేశారు. పటేల్ తన అధికారిక విధులకు హాజరుకావడం కంటే నైట్‌క్లబ్‌లలోనే ఎక్కువగా కనిపిస్తున్నారని, ఆయన పనితీరు గందరగోళంగా ఉందని ఫిగ్లియుజ్జి విమర్శించారు. ఎఫ్‌బీఐలో కౌంటర్ ఇంటెలిజెన్స్‌కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా గతంలో పనిచేసిన ఫిగ్లియుజ్జి, ఒక కార్యక్రమంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఫిగ్లియుజ్జి మాట్లాడుతూ, “హూవర్ భవనంలోని ఏడో అంతస్తులో (ఎఫ్‌బీఐ ప్రధాన కార్యాలయం) కంటే కాష్ పటేల్ ఇప్పుడు నైట్‌క్లబ్‌లోనే ఎక్కువగా కనిపిస్తున్నారని నివేదికలు వస్తున్నాయి” అని పేర్కొన్నారు. అంతేకాకుండా, రోజువారీగా జరగాల్సిన కీలక బ్రీఫింగ్‌లను సైతం వారానికి రెండుసార్లకు తగ్గించారని ఆయన ఆరోపించారు. “ఇది ఒక రకంగా మంచిది, మరో రకంగా ప్రమాదకరం. ఎందుకంటే ఆయన అనుభవం లేకుండా ఏవైనా పనులు చేయాలని ప్రయత్నిస్తే అవి తీవ్ర పరిణామాలకు దారితీయవచ్చు. ప్రస్తుతం ఏజెంట్లు పనిచేయడానికి ఆయన అనుమతిస్తున్నారు. కానీ వారి పనితీరు ఎటువైపు వెళుతుందో స్పష్టత లేదు” అని ఫిగ్లియుజ్జి ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, కాష్ పటేల్ ప్రభుత్వ వనరులను దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ముఖ్యంగా, ఏజెన్సీకి చెందిన ప్రైవేటు విమానాలను ఆయన వ్యక్తిగత పనులకు వాడుకుంటున్నారని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డెమోక్రాట్లు డిమాండ్ చేస్తున్నారు. భారతీయ మూలాలున్న కాష్ పటేల్ మొదటి నుంచి డొనాల్డ్ ట్రంప్‌కు అత్యంత విధేయుడిగా వ్యవహరించారని గతంలో అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో, తన రాజకీయ ప్రత్యర్థులపై కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేయడానికి పటేల్ సరైన వ్యక్తి అని ట్రంప్ భావించినట్లు ఆ కథనాలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే 2020లో ట్రంప్ ఆయన్ను సీఐఏ డైరెక్టర్‌గా నియమించాలని భావించినా అది సాధ్యపడలేదు. ఆ తర్వాత తన పదవీకాలం చివరి రోజుల్లో ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమించాలని ప్రయత్నించారు. కాష్ పటేల్, ట్రంప్ ప్రతిపాదించిన ‘మేక్ అమెరికా గ్రేట్ అగైన్’ అజెండాకు గట్టి మద్దతుదారుగా నిలిచారు.

## కేదార్‌నాథ్ ఆలయానికి తొలిరోజు పోటెత్తిన భక్తులు..
# 30వేల మందికి పైగా భక్తుల దర్శనం

న్యూఢిల్లీ : కేదార్‌నాథ్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. శుక్రవారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 30 వేల మందికిపైగా కేదార్‌నాథుడిని దర్శించుకున్నారు. చార్‌ధామ్ యాత్రలో భాగంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు వేద మంత్రోచ్చారణతో కేదార్‌నాథుని ఆలయ ద్వారాలు తెరచుకున్న విషయం తెలిసిందే. నిన్న సాయంత్రం 7 గంటల వరకు అధికారిక గణాంకాల ప్రకారం 30 వేల మందికిపైగా భక్తులు దర్శించుకున్నారు. ఇందులో 19,196 మంది పురుషులు ఉండగా, 10,597 మంది మహిళలు, 361 మంది ఇతరులు ఉన్నారని అధికారులు వెల్లడించారు. శుక్రవారం కేదార్‌నాథ్ ధామ్ తలుపులు తెరుచుకున్న సందర్భంగా భారత సైన్యం యొక్క గర్వాల్ రైఫిల్స్ బృందం భక్తి గీతాలను వాయించింది. అలాగే ధామ్ పోర్టల్ ప్రారంభోత్సవానికి ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి కూడా హాజరయ్యారు. కేదార్‌నాథ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ముఖ్య సేవక్ భండారాలో భక్తులకు ముఖ్యమంత్రి ప్రసాదం పంపిణీ చేశారు. మే 4న బద్రీనాథ్ తలుపులు తెరుచుకుంటాయని ఈ సందర్భంగా సీఎం ధామి వెల్లడించారు. సీఎం ధామి మాట్లాడుతూ… “దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులను స్వాగతించడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉంది. ప్రతి స్థాయిలో తీర్థయాత్రను నిరంతరం పర్యవేక్షిస్తుంది. తీర్థయాత్ర మార్గాల్లో వివిధ ప్రాథమిక సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశాం. చార్ ధామ్ యాత్ర రాష్ట్ర జీవనాడి కూడా. ఈ తీర్థయాత్ర లక్షలాది మందికి జీవనాధారం” అని ఆయన అన్నారు. కేదార్‌నాథ్ పునర్నిర్మాణ పనుల కోసం రూ. 2000 కోట్లు కేటాయించినట్లు సీఎం ధామి ప్రకటించారు. అలాగే గౌరీకుండ్ నుంచి కేదార్‌నాథ్ వరకు రోప్‌వే ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కాగా, పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలైన 12 జ్యోతిర్లింగాల్లో కేదార్‌నాథ్ ఆలయం ఒకటి. చార్‌ధామ్ యాత్రలో కేదార్ నాథ్ దేవాలయం సందర్శన భాగంగా ఉంటుంది. ప్రతి ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్‌కు చేరుకుని పరమేశ్వరుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అయితే ఏటా శీతాకాలం ప్రారంభం కాగానే ఈ ఆలయాన్ని మూసివేస్తారు. శీతాకాలంలో దాదాపు ఆరు నెలల పాటు ఈ ఆలయ తలుపులు మూసే ఉంటాయి. ఆ సమయంలో ఆలయం మొత్తం మంచుతో కప్పుకుపోయి ఉంటుంది. తిరిగి వేసవిలో ఈ ఆలయ తలుపులు తిరిగి తెరుస్తారు.

## కవితతో 20 ఏళ్ల స్నేహం.. నందమూరి అలేఖ్య ఎమోషనల్ పోస్ట్!

హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో తనకున్న అనుబంధం గురించి దివంగత నందమూరి తారకరత్న సతీమణి అలేఖ్య రెడ్డి సామాజిక మాధ్యమ వేదికగా చేసిన ఒక పోస్ట్ వైరల్ అవుతోంది. తమ స్నేహం రెండు దశాబ్దాలుగా కొనసాగుతోందని, ఈ ప్రయాణంలో తమ బంధం మరింత బలపడిందని ఆమె తన పోస్ట్ ద్వారా వెల్లడించారు. కవితతో కలిసి దిగిన ఓ ఫోటోను కూడా ఆమె పంచుకున్నారు. గత 20 సంవత్సరాలుగా కవితతో తనకు మంచి స్నేహం ఉందని అలేఖ్య తెలిపారు. ఈ కాలంలో ఎన్ని ఆటుపోట్లు, చిన్నపాటి మనస్పర్థలు ఎదురైనప్పటికీ, తమ స్నేహ బంధం మాత్రం చెక్కుచెదరలేదని ఆమె పేర్కొన్నారు. కవిత పట్ల తనకు ఎంతో అభిమానం ఉందని, ఇద్దరూ ఎంతో కలిసిమెలిసి ఉంటామని అలేఖ్య చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో కూడా తమ స్నేహం ఇలాగే కొనసాగాలని ఆశిస్తున్నట్లు ఆమె తన పోస్ట్ లో వివరించారు. ఈ పోస్టు సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. నెటిజన్లు ఈ పోస్ట్‌పై భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. కొందరు వారి స్నేహాన్ని ప్రశంసిస్తూ, కలకాలం ఇలాగే ఉండాలని ఆకాంక్షిస్తూ కామెంట్లు పెడుతున్నారు. మరికొందరు మాత్రం, నందమూరి అలేఖ్య బీఆర్ఎస్ పార్టీకి దగ్గరవుతున్నారా అనే కోణంలో తమ అభిప్రాయాలను వ్యాఖ్యల రూపంలో వ్యక్తం చేస్తున్నారు.

## పహల్గామ్ ఉగ్రదాడి గురించి అమెరికాకు తెలుసు.. నివేదిక ఉంది: కేఏ పాల్

హైదరాబాద్ : పహల్గామ్ ఉగ్రదాడి గురించి అమెరికాకు తెలుసని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ ఉగ్రదాడికి సంబంధించిన పూర్తి సమాచారం అమెరికా ఇంటెలిజెన్స్ వద్ద ఉందని అన్నారు. పహల్గామ్‌లో దాడులు ఎవరు చేశారు, ఎందుకు చేశారు, వారి వెనుక ఎవరున్నారనే విషయాలు అమెరికా నివేదికలో ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఈ దాడి ఎవరు, ఎవరి కోసం చేశారనే వివరాలు కూడా నివేదికలో ఉన్నాయని తెలిపారు. వాషింగ్టన్ పోస్ట్ జర్నలిస్టును టర్కీలోని సౌదీ ఎంబసీలోనే ముక్కలు ముక్కలు చేశారని, అది చేయించింది ఎవరు, చేసింది ఎవరో కూడా అందరికీ తెలుసని అన్నారు. ఈ దుర్ఘటనను ప్రపంచమంతా ఖండించిందని, కానీ ట్రంప్ మాత్రం మిలియన్ల డాలర్లు తీసుకొని సౌదీని కాపాడారని ఆరోపించారు. రాజకీయాల్లో డబ్బుతో ఎవరినైనా కొనేసే కుట్రలు చేస్తున్నారని, ఆ చట్టాన్ని కూడా డబ్బుతో కొనేస్తున్నారని విమర్శించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం గురించి మాట్లాడుతూ, రష్యా ఆక్రమించిన 20 శాతం ఉక్రెయిన్ ప్రాంతాన్ని రష్యాకు ఇచ్చేయాలని ట్రంప్ మాట్లాడుతున్నారని, దీనిని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. ట్రంప్ ప్రకారం చైనా ఆక్రమించిన భారత భూభాగాన్ని చైనాకు ఇచ్చేయాలా అని ప్రశ్నించారు. ఆ విషయానికి వస్తే చైనా ఆక్రమించిన హాంకాంగ్, పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ ప్రాంతాలను కూడా ఆ దేశానికే ఇచ్చేయాలా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ సేన :**



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో స్థానిక ఎస్సార్ కన్వెన్షన్ లో 2011- 2012 సంవత్సరం లో చదివిన పదవ తరగతి విద్యార్థుల ఆదివారం నాడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 13 సంవత్సరాల క్రితం కలిసిన విద్యార్థులంతా తిరిగి తాము చదువుకున్న పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకోవడం ఆనందంగా ఉందని విద్యార్థులంతా సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల దశలో తాము చదువుకున్న పాఠశాలలో ఆడిన ఆటలను మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశలో కలుసుకున్న తామంతా తిరిగి చాలా కాలం తర్వాత ఒక్కొక్కరు ఒక్కొక్క స్థాయికి ఎదిగి కలుసుకోవడం సంతోషాన్నిచ్చిందని తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ సురకంటి వెంకట్ రెడ్డి ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ ,గురువులు, ధర్మన్న, రాజేశ్వర్, గణేష్, రాజేష్, ఏక్నాథ్, లక్ష్మణ్,నిజాముద్దీన్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న వంగపల్లి అంజయ్య స్వామి

**తెలంగాణ సేన న్యూస్ :**



సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్యవైశ్య సీనియర్ నాయకులు చందా లక్ష్మయ్య, లక్ష్మి నర్సమ్మ వివాహ వార్షికోత్సవ వేడుకలు వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం గజ్వేల్ లో వైభవంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు వాసవి ఉపాసకులు ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ చందా లక్ష్మయ్య లక్ష్మి నర్సమ్మ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపి,వారి కుటుంబానికి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి అనుగ్రం,నిండు దీవెనలు ఉంటాయని,అత్యంత వైభవంగా వివాహ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించిన చందా లక్ష్మయ్య లక్ష్మి నర్సమ్మ కుటుంబ సభ్యులను అభినందించారు,ఈ కార్యక్రమంలో, చందా శ్రీనివాస్, నాగరాజు,చందా లక్ష్మయ్య లక్ష్మి నర్సమ్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పాక్‌కు మరో షాక్.. ఆ దేశం నుంచి దిగుమతులపై నిషేధం



దిల్లీ: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈక్రమంలోనే దాయాదితో అన్ని రకాల దౌత్య సంబంధాలు తెంచుకుంటోన్న న్యూదిల్లీ తాజాగా మరో గట్టి షాకిచ్చింది. ఆ దేశం నుంచి వచ్చే దిగుమతులపై నిషేధం విధించింది. ఈమేరకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశ భద్రత, ప్రజా విధాన ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. పాకిస్థాన్ నుంచి మన దేశానికి రవాణా అయ్యే అన్ని ఉత్పత్తులకు ఈ నిషేధం వర్తిస్తుందని స్పష్టం చేసింది. “పాకిస్థాన్‌లో ఉత్పత్తి అయ్యే లేదా ఆ దేశం నుంచి భారత్‌కు వచ్చే అన్నిరకాలా వస్తువుల ప్రత్యక్ష, పరోక్ష దిగుమతులపై నిషేధం విధిస్తున్నాం. అనుమతులు ఉన్న ఉత్పత్తులైనా, స్వేచ్ఛాయుత దిగుమతులైనా సరే పాక్ నుంచి ఎలాంటి వస్తువులను అనుమతించబోం. ఈ నిషేధం తక్షణమే అమల్లోకి వస్తుంది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ ఆంక్షలు కొనసాగుతాయి. ఈ నిషేధం నుంచి ఏవైనా మినహాయింపులు కావాలంటే.. భారత ప్రభుత్వం నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి” అని వాణిజ్య మంత్రిత్వ శాఖ తమ నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

దిగుమతుల విలువ తక్కువే..

భారత్-పాకిస్థాన్ మధ్య వాణిజ్యానికి ఉన్న ఏకైక రవాణా మార్గం అటారీ-వాఘా సరిహద్దు. ఇప్పటికే దాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. ఇక, 2019లో పుల్వామా దాడి తర్వాత నుంచి దాయాది నుంచి మనం చాలావరకు దిగుమతులు తగ్గించుకున్నాం. పాక్ ఉత్పత్తులపై కేంద్రం 200శాతం సుంకం విధించింది. కొన్ని రకాల ఫార్మా ఉత్పత్తులు, పండ్లు, నూనెగింజల వంటి వాటిని మాత్రమే దాయాది నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. గణాంకాల పరంగా చూస్తే కూడా.. ఈ దిగుమతుల విలువ చాలా తక్కువే. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి పాక్‌కు 447.65 మిలియన్ డాలర్ల వస్తువులు ఎగుమతి కాగా.. అక్కడినుంచి కేవలం 0.42 మిలియన్ డాలర్ల ఉత్పత్తులను మాత్రమే దిగుమతి చేసుకున్నాం. ప్రపంచవ్యాప్తంగా భారత్ జరుపుతున్న వాణిజ్యంలో ఇది కేవలం 0.1శాతం మాత్రమే.

పాక్‌లో ఆ రంగాలపై ప్రభావం..

విలువ పరంగా ఈ వాణిజ్యం స్వల్పమే అయినప్పటికీ.. పాక్‌లోని కొన్ని పరిశ్రమలు భారత్‌కు చేసే ఎగుమతులపైనే ఆర్థికంగా ఆధారపడుతున్నాయి. ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్స్, విలువైన లోహ సమ్మేళనాలు, మినరల్ ఫ్యుయల్స్, నూనె ఉత్పత్తులు, కొన్ని రకాల పిండి పదార్థాలు, బంక, ఎంజైమ్స్, వర్ణ ద్రవ్యాలు, మసాలా దినుసులు వంటివి దిగుమతి చేసుకునే వస్తువుల్లో ఉన్నాయి. ఇప్పుడు భారత్ వాటిపై నిషేధం విధించడంతో పాక్‌లో ఆయా రంగాల పరిశ్రమలు కుదేలయ్యే అవకాశం ఉంది.

పాక్ ఓడలు రావొద్దు..

మరోవైపు, పాకిస్థాన్‌తో సముద్ర రవాణా మార్గాలను భారత్ మూసివేసింది. ఆ దేశ జెండాతో ఉన్న ఓడలు భారత పోర్టుల్లోకి రాకుండా కేంద్రం నిషేధం విధించింది. మర్చెంట్ షిప్పింగ్ చట్టం, 1958లోని 411 సెక్షన్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఆంక్షలు తక్షణమే అమల్లోకి వస్తాయని వెల్లడించింది. అటు భారత ఓడలు కూడా పాక్ పోర్టుల్లోకి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ఇప్పటికే పాక్ విమానాలకు మన గగనతలాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే.

# చంద్రబాబూ.. రైతుల గోడు వినిపించడం లేదా..

మొదటి పేజి తరువాయి



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా..‘చంద్రబాబు.. కనీస మద్దతు ధరలు లభించక రాష్ట్రంలో రైతులు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నా వారి గోడు పట్టించుకోవడం లేదు. కనీస మద్దతు ధరలు లభించక, పెట్టిన పెట్టుబడులూ రాక రైతులు అప్పుల ఊబిలోకి కూరుకు పోతున్నారు. మీరు, మీ మంత్రులు, యంత్రాంగం కనీసం వారివైపు కన్నెత్తికూడా చూడకపోవడం ధర్మమేనా? మిరప, పత్తి, జొన్న, కందులు, మినుములు, పెసలు, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, వేరుశెనగ, టమోటా, అరటి, చీని, పొగాకు ఇలా ఏ పంట చూసినా కనీస మద్దతు ధరలు రావడం లేదు. చొరవ చూపి, మార్కెట్లో జోక్యం చేసుకోవాలన్న కనీస బాధ్యతను విస్మరించారు. పైగా డ్రామాలతో ఆ రైతులను నిలువునా మోసం చేస్తున్నారు. ఇది న్యాయమేనా? మిర్చి విషయంలో కూడా మీరు రైతులను నమ్మించి మోసం చేశారు. మిర్చి కొనుగోలు అంశం కేంద్రం పరిధిలో లేకపోయినా, నాఫెడ్ కొనుగోలు చేస్తుందని మొదట నమ్మబలికారు. క్వింటాలు రూ.11,781కు కొంటామని చెప్పి, ఒక్కపైసా కూడా ఖర్చు పెట్టకుండా, ఒక్క రైతు నుంచి కాని, ఒక్క ఎకరాకు సంబంధించి కాని, ఒక్క క్వింటాల్ గాని కొనకుండా అన్నం పెట్టే రైతులకు సున్నం రాశారు. మా హయాంలో ధరల స్థిరీకరణ నిధి కింద రూ.3వేల కోట్లు పెట్టి, ఐదేళ్లలో రూ.7, 796 కోట్లు ఖర్చుచేశాం. చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుని కనీస మద్దతు ధరల జాబితాలో లేని పొగాకు సహా అనేక పంటల రైతులను ఆదుకున్నాం. మీరు కొత్తగా ఏమీ చేయకపోయినా, కనీసం మా విధానాన్ని కొనసాగించి ఉంటే రైతులకు ఊరట లభించేది కదా? పైగా ఈ ఏడాది బడ్జెట్లో రూ.300 కోట్లు కేటాయించడం దారుణం కాదా? ఇందులో కూడా కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టిన దాఖలాలు ఉన్నాయా?.

రైతుల ఆందోళనపై వైఎస్ జగన్ ట్వీట్

ధాన్యం, కోకో, పొగాకు, ఆక్వా రైతులు ఆయా జిల్లాల్లో ఆందోళనలు చేస్తుంటే, ఇప్పటికీ రోమ్ చక్రవర్తి ఫిడేలు వాయించినట్లుగా వ్యవహరిస్తున్నారు. జనాభాలో 60శాతం మంది ప్రజలు ఆధారపడే వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల అది తీవ్ర సంక్షోభానికి దారితీస్తే, లక్షల మంది ఉపాధికి గండిపడితే దానికి బాధ్యత ఎవరు తీసుకుంటారు? వెంటనే ప్రభుత్వం తరఫున మార్కెట్లో జోక్యం చేసుకోవాలని, కనీస ధరలు లభించని పంటల విషయంలో ప్రభుత్వమే జోక్యంచేసుకుని, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నాను’ అంటూ వ్యాఖ్యలు చేశారు.

## ఉగ్రవాదుల్నే కాదు.. వారి మద్దతుదారుల అంతు కూడా చూస్తాం

మొదటి పేజి తరువాయి

ఉగ్రవాదాన్ని అంతం చేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఉగ్రదాడి తర్వాత మోదీ మాట్లాడుతూ.. పహల్గామ్ పై ఘటనకు బాధ్యులైన వారిని ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. వారిని మట్టిలో కలిపేస్తామంటూ మోదీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. తాజాగా మరోసారి ఉగ్రచర్యలకు సంబంధించి హెచ్చరికలు జారీ చేశారు. శనివారం అంగోలా అధ్యక్షుడు మాన్యుయెల్ గొంకాల్వ్స్ లౌరెంకోతో కలిసి జాయింట్ ప్రెస్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్న మోదీ.. ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా మాన్యుయెల్ గొంకాల్వ్స్ లౌరెంకో భారత్ కు వచ్చిన సంగతి తెలిసిందే. ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్తాన్ ల మధ్య యుద్ధ వాతావరణ తలపిస్తోంది. ఈ ఉగ్రవాద చర్య పాకిస్తాన్ భూ భాగం నుంచే జరిగిందేనని బలంగా నమ్ముతున్న భారత్.. ఆ మేరకు ఆంక్షలు విధిస్తూ వస్తోంది. పాకిస్తాన్ ను అష్టదిగ్బంధనం చేసి ఉక్కిరి బిక్కిరి చేసే యత్నాలను ఇప్పటికే భారత్ ప్రారంభించింది. పాకిస్తాన్ పౌరులు భారత్ ను విడిచి వెళ్లిపోవాలనే ఆదేశాల దగ్గర్నుంచి పలు నిషేధాజ్ఞల్ని భారత్ అమలు చేస్తూ వస్తోంది. సింధూ జలాలను పాక్‌కు వెళ్లకుండా నిలిపివేయడం, భారత్‌లో పాకిస్తాన్‌కు చెందిన ప్రముఖుల యూట్యూబ్ చానెళ్ల నిలిపివేత, భారత్ జలాల్లోకి పాక్ ఓడలు రాకుండా నిషేధం, పాక్ దిగుమతులపై నిషేధం ఇలా పలు రకాలైన ఆంక్షలతో పాక్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది టూరిస్టులు అసువులు బాసిన నేపథ్యంలో భారత్ తీవ్రంగా స్పందించింది. పాకిస్తాన్ కు ఒకవైపు హెచ్చరికలు పంపుతూనే, ఏ క్షణంలో ఏం జరిగిన భారత బలగాలు సిద్ధంగా ఉండాలనే స్వేచ్ఛను కూడా వారికి అప్పగించింది. దాంతో పాకిస్తాన్ ఏమైనా కవ్వింపు చర్యలకు పాల్పడి యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తే అందుకు బదులు తీర్చుకునేందుకు భారత్ సిద్ధంగా ఉంది.

## మోదీ తీరు చూస్తే చిచ్చుబుడ్డి తుస్సుమంది అనక తప్పదు

అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణానికి నిధుల విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిపై ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. విభజన చట్టం ప్రకారం రాజధాని నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదే అయినప్పటికీ, ప్రధాని మోదీ హామీలు నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆమె ఆరోపించారు. “మోదీ తీరు చూస్తే చిచ్చుబుడ్డి తుస్సుమంది అనక తప్పదు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం 94(3) సెక్షన్ ప్రకారం నవ్యాంధ్ర నూతన రాజధాని నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదే. నూతన రాజధానిలో మౌలిక సదుపాయాలు కల్పన కేంద్రం కల్పించి ఇవ్వాల్సిందే. విభజన చట్టంలో కేంద్రం విధులేంటో ఇంత స్పష్టంగా పేర్కొంటే.. మరి ప్రధాని మోదీ గారు మనకు ఇస్తున్నది ఏమిటి? ఆనాడు 2015లో మట్టి కొట్టారు. నేడు సున్నం కొట్టి వెళ్ళారు. 10 ఏళ్ల క్రితం ఏం చెప్పి ఆంధ్రులకు తీరని ద్రోహం చేశారో.. నేడు అవే అబద్ధాలను అందంగా చెప్పి ఘరానా మోసం చేశారు. మళ్ళీ “అభివృద్ధి చేస్తాం, భుజాలు కలుపుతాం” అంటూ బూటకపు మాటలు చెప్పారు. 5 కోట్ల మంది కలల సౌధం అమరావతికి 2015 నుంచి అన్ని చేశామని పచ్చి అబద్ధాలు చెప్పారు. అన్ని ఇస్తే మాకు రాజధాని నిర్మాణం ఇంతవరకు ఎందుకు కాలేదు? అమరావతి నిర్మాణానికి ఖర్చుయ్యే లక్ష కోట్లలో ఒక్క రూపాయి అయినా ప్రకటించారా? రాజధాని నిర్మాణం కేంద్రం బాధ్యత అని హామీ ఇచ్చారా? కనీసం అమరావతికి చట్టబద్ధత ఇస్తున్నామని చెప్పారా? పోనీ విభజన హామీలపై టైమ్ బాండ్ క్లారిటీ ఇచ్చారా? చంద్రబాబు గారు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. మోదీని నమ్మి మళ్ళీ మళ్ళీ మోసపోతున్నట్లు తెలుసుకోవాలి. ఏదో ఉద్ధరిస్తారని, కాసులు కురిపిస్తారని నమ్మి ఒకసారి రాత్రి గోతిలో పడ్డ చంద్రబాబు గారు.. మళ్ళీ మోదీని పిలిచి అదే గోతిలో పగలు పడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గారిని కాంగ్రెస్ పార్టీ పక్షాన సూటిగా ప్రశ్నిస్తున్నాం. రాజధానికి కావాల్సింది అప్పులు కాదు.. నిధులు. రాష్ట్రం రూ.10 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని, అప్పు పుట్టనిదే జీతాలకు దిక్కులేదని చెప్పే మీరు రాజధాని నిర్మాణానికి ఎవరిని అడిగి రూ.60 వేల కోట్లు అప్పు తెస్తున్నారు? వడ్డీల భారం మోసేదెలా? వరల్డ్ బ్యాంక్, ఎడిబి, కెఎస్‌ఢబ్యూ, హడ్కోల దగ్గర రాష్ట్రాన్ని ఎందుకు తాకట్టు పెడుతున్నారు? ప్రభుత్వ భూములు అంటే ప్రజల ఆస్తి వాటిని అమ్మి రాజధాని ఎలా కడతారు? కేంద్రం మెడలు వంచే దమ్ములేక భావితరాల మీద అప్పు భారం ఎందుకు మోపుతున్నారో రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు గారు సమాధానం చెప్పాలి” అని షర్మిల డిమాండ్ చేశారు.

# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది

మొదటి పేజి తరువాయి

కొత్తగా చేర్పుల పైన లబ్ది దారులు వేచి చూస్తున్నారు. ఈ అంశం పైన పౌర సరఫరాల శాఖ తాజాగా మార్గదర్శకాలు జారీ చేసింది. ఇప్పటికే దరఖాస్తు చేసు కున్న వారికి కొత్త కార్డుల జారీ పైన స్పష్టత ఇచ్చింది. అదే విధంగా కొత్తగా రేషన్ లబ్ది దారులకు సన్న బియ్యం పంపిణీ మొదలైంది. ఇదే సమయంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల పైన తాజాగా స్పష్టత ఇచ్చింది. కొత్తగా 11 లక్షల మంది రేషన్ లబ్దిదారులుగా అర్హత పొందారు. వీరి చేరికతో రాష్ట్రంలో రేషన్ లబ్దిదారుల సంఖ్య 2.93 కోట్లకు చేరింది. పరిశీలన చేసి అర్హులైన వారికి కొత్త కార్డులు జారీ చేసింది. తాజా గణాంకాల ప్రకారం 31,084 కుటుంబాలకు కొత్తగా రేషన్ కార్డులు మంజూరయ్యాయి. వీటి ద్వారా 93,584 మంది సభ్యులు లబ్ధిదారులుగా గుర్తింపు పొందారు. పాత కార్డుల్లో అదనంగా 10,12,199 మంది పేర్లు చేరాయి. ఈ మేరకు అధికారుల ద్వారా కార్డుల జారీ, సభ్యుల చేర్పు ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో రేషన్ బియ్యం కోటా కూడా తగినట్లుగానే పెరిగింది. జనవరిలో 1.79 లక్షల టన్నులు గా ఉన్న బియ్యం కోటా, మే నెల నాటికి 1.86 లక్షల టన్నులకు చేరింది. కొత్త లబ్ధిదారుల అవస రాల కోసం అదనంగా 4,431 టన్నుల బియ్యాన్ని అధికారులు సరఫరా చేస్తున్నారు. ఇక, ఇదే సమయంలో పాత కార్డుల్లో కొత్తగా చేర్పులు.. తొలిగింపుల పైన ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. లబ్ది దారుల నుంచి దరఖాస్తుల మేరకు జనవరి నుంచి మే మధ్యలో ప్రభుత్వం 19 లక్షలకు పైగా లబ్ధిదారులను కొత్తగా గుర్తించింది. అయితే సాంకేతిక కారణాల వల్ల 7 లక్షలకు పైగా పేర్లు తొలగించినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తల్లిదండ్రుల కార్డుల్లో ఉన్నవాళ్లు వివాహం తర్వాత వేరుగా ఉండటంతో కార్డుల్లో మార్పులు జరిగాయి. చివరికి నికరంగా 12 లక్షల మందికి కొత్తగా రేషన్ అందనుంది. ఇక..ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో ఇంకా మూడు లక్షల దాకా పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులు వాటిని దశలవారీగా పరిశీలించి కొత్తగా చేర్పుల ప్రక్రియ కొనసాగుతోంది.

## తెలంగాణలో 33 జిల్లాలకు గాను 32 జిల్లాల మీదుగా జాతీయ రహదారులు వెళుతున్నాయి: కిషన్ రెడ్డి

మొదటి పేజి తరువాయి



గత దశాబ్ద కాలంలో తెలంగాణలో జాతీయ రహదారులను అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. 2014 నాటికి తెలంగాణలో కేవలం 2,500 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉండగా, ప్రస్తుతం వాటి పొడవు 5,200 కిలోమీటర్లకు చేరుకుందని వెల్లడించారు. రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాలకు గాను, 32 జిల్లాల మీదుగా ఇప్పుడు జాతీయ రహదారులు వెళుతున్నాయని తెలిపారు. రహదారుల అభివృద్ధి జరిగితేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని, అనుసంధానం అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వాజ్‌పేయి హయాంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘స్వర్ణ చతుర్భుజి’ పథకాన్ని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. అయితే, 2004లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల నిర్మాణంపై లక్షల కోట్ల రూపాయల ఖర్చు ఎందుకంటూ విమర్శించి, ఆ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేదని ఆరోపించారు. ప్రస్తుత మోదీ ప్రభుత్వం రహదారుల అనుసంధానం కోసం అధిక నిధులు కేటాయిస్తోందని, పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉన్న అన్ని ప్రాంతాలకు రోడ్డు మార్గాలను నిర్మిస్తున్నామని అన్నారు. తెలంగాణలో రింగ్ రోడ్ల అభివృద్ధి పనులు కూడా జరుగుతున్నాయని కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్-శ్రీశైలం మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని, అలాగే హైదరాబాద్-విజయవాడ మధ్య ఆరు లైన్ల రహదారి నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తున్నామని ఆయన వివరించారు.

## నాది బాధ్యత, మోదీకి చంద్రబాబు హామీ - మిషన్ 2029..!!

మొదటి పేజి తరువాయి




సభ సక్సెస్ కావటంతో కూటమి నేతలు ఖుషీ అవుతున్నారు. ఇదే సమయం లో ప్రధాని అమరావతి పర్యటన పైన ఆసక్తికర ట్వీట్ చేసారు. చంద్రబాబు సైతం అమరావతి కేంద్రంగా కీలక హామీ ఇచ్చారు.

ప్రధాని సందేశం:

అమరావతిలో ప్రధాని మోదీ పనులను రీ లాంచ్ చేసారు. అమరావతితో పాటుగా రాష్ట్రంలో పలు నిర్మాణాలకు శంకుస్థాపన చేసారు. అమరావతి సభలో పాల్గొన్న ప్రధాని మోదీ చేసిన ట్వీట్ వైరల్ అవుతోంది. అమరావతి అభివృద్ధిలో నూతన, చారిత్రాత్మక అధ్యాయాన్ని ప్రారంభించిన సంద ర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని నా సోదర, సోదరీమణుల మధ్య ఉండటం ఆనందంగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. అమరావతి భవిష్యత్ పట్టణ కేంద్రంగా ఆవిర్భవిస్తుందని, ఇది ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథాన్ని మెరుగుపరుస్తుందని నేను విశ్వసిస్తున్నట్లు ప్రధాని వివరించారు. నాకు మంచి మిత్రుడు, ముఖ్యమంత్రి చంద్రబాబుకి అమరావతి పట్ల ఉన్న దార్శనికత, ఏపీ ప్రజల సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధతను నేను అభినందిస్తున్నట్లు ట్వీట్ లో వెల్లడించారు. ప్రధాని మోదీ ట్వీట్ పై సీఎం చంద్రబాబు స్పందించారు. ప్రజల సహకారంతో, కేంద్ర ప్రభుత్వ మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి తమకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతామని అన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి పేరుపేరునా సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సహకారంతో, కేంద్ర మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తాం. అన్ని ప్రాంతా ల సమగ్ర అభివృద్ధి సాధించి.... మాకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం అని తెలుపుతూ...ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ట్వీట్ లో పేర్కొన్నారు.

## నెలకు రూ.60 వేల జీతం... జాబ్ నోటిఫికేషన్ విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం

మొదటి పేజి తరువాయి

రాష్ట్ర ప్రణాళికా శాఖలో ఖాళీగా ఉన్న 175 యంగ్ ప్రొఫెషనల్స్ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలకు సంబంధించిన విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన, ప్రభుత్వ పి4 కార్యక్రమాల సమన్వయం కోసం ఈ నియామకాలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం ఈ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఈ యంగ్ ప్రొఫెషనల్స్ నియామకాలు ఏడాది కాలానికి ఒప్పంద పద్ధతిలో జరుగుతాయి. అభ్యర్థుల పనితీరు, అవసరాల ఆధారంగా ఈ కాంట్రాక్టు కాలాన్ని భవిష్యత్తులో పొడిగించే అవకాశం ఉందని తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి ఒకరు చొప్పున ఈ యంగ్ ప్రొఫెషనల్స్ పనిచేయాల్సి ఉంటుంది. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎంబీఏ లేదా ఏదైనా పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) డిగ్రీని కలిగి ఉండాలి. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 60,000 చొప్పున వేతనం చెల్లించనున్నట్లు ప్రభుత్వం నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. వయోపరిమితి విషయానికొస్తే, 2025 మే 1వ తేదీ నాటికి అభ్యర్థి వయసు 40 ఏళ్లు మించకూడదని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ విధానంలో మే 13వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా విద్యార్హతలు, రాత పరీక్ష, ఇంటర్వ్యూలను ప్రామాణికంగా తీసుకుంటారని ప్రభుత్వం తెలిపింది. ఈ పోస్టులకు సంబంధించిన విద్యార్హతలు, ఎంపిక విధానం, వేతనం తదితర పూర్తి వివరాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన https://apsdpscareers.com/YP.aspx వెబ్ పోర్టల్‌ను సంప్రదించాలి.

# ఈసారి జీడీపీ 6.4 శాతమే.. భారత్ వృద్ధికి ఫిక్కీ కోతలు

## గతంలో 7 శాతంగా అంచనా




ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) భారత జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతంగానే ఉండొచ్చని గురువారం దేశీయ వ్యాపార, పారిశ్రామిక సంఘం ఫిక్కీ ఎకనామిక్ ఔట్‌లుక్ సర్వే అంచనా వేసింది. అంతకుముందు ఇది 7 శాతంగా ఉంటుందని పేర్కొనగా.. ఇప్పుడు అర శాతానికిపైగా కుదించడం గమనార్హం. ఇక 2023-24 దేశ జీడీపీ వృద్ధిరేటు 8.2 శాతం గా ఉన్నది. ఈ క్రమంలో తాజా అంచనా మరింతగా వృద్ధిపై అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. గత నెల డిసెంబర్‌లో ప్రముఖ ఆర్థికవేత్తలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ నిపుణుల నుంచి సేకరించిన స్పందనలు, అభిప్రాయాల ఆధారంగా ఈ సర్వేను ఫిక్కీ చేపట్టింది.

**ఒడిదొడుకులు**

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందన్న దానిపై నిపుణులు స్పందిస్తూ.. స్వల్ప కాలంలో ఎగుమతులు, విదేశీ పెట్టుబడులు మందగించవచ్చున్నారు. ఇక అధిక సుంకాలు, వీసా నిబంధనలు కూడా కొంత ఇబ్బందికరమేనన్నారు. రూపాయి మారకం విలువ స్థిరత్వాన్ని కోల్పోవచ్చని చెప్తున్నారు. ఇదిలావుంటే వ్యవసాయోత్పత్తి పెంపు, మెరుగైన గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, గిడ్డంగుల వ్యవస్థ బలోపేతం వంటివి ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించగలవని సూచించారు.

# అంచనాలకుమించి రాణించిన ఇన్ఫోసిస్




దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక లాభంలో 11.46 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. ఐటీ సేవలకు డిమాండ్ ఊపందుకోవడం, వార్షిక విక్రయాల అంచనా మూడోసారి పెంచడం సంస్థకు కలిసొచ్చింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.6806 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.6,106 కోట్ల లాభంతో పోలిస్తే రెండంకెల వృద్ధిని సాధించింది. అలాగే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.6 శాతం అధికమై రూ.41,764 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయంలో 4.5-5 శాతం వరకు పెరుగుదలవుండవచ్చునని గైడెన్స్‌లో పేర్కొంది. ఈ సందర్భంగా కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సలీల్ పరేఖ్ మాట్లాడుతూ..ఆర్థిక సేవలతోపాటు రిటైల్, కన్స్యూమర్ ప్రొడక్ట్స్ రంగంలో మార్పులు అధికంగా చోటు చేసుకుంటున్నాయని, దీంతో ఈ ఏడాది ఆదాయ వృద్ధిలో అంచనాను సవరించినట్లు చెప్పారు. కంపెనీ మొత్తం ఆదాయంలో బీఎఫ్ఎస్ఐ నుంచి మూడోవంతు సమకూరుతున్నదని, అత్యధికంగా సమకూరుతున్న అమెరికాలో 6.1 శాతం వృద్ధిని కనబరిచినట్లు చెప్పారు. గత త్రైమాసికంలో 5,591 మంది ఉద్యోగులు జతయ్యారు. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 3,23,379కి చేరుకున్నారు. ప్రస్తుతేడాది 15 వేల మంది ఉద్యోగ నియామక ప్రక్రియ కొనసాగుతున్నదని, వీరితోపాటు 20 వేల మంది ఫ్రెషర్లను సైతం తీసుకోబోతున్నది.

## లాభాల్లో ముగిసిన మార్కెట్లు

# సెన్సెక్స్ 318 పాయింట్లు జంప్



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 77,319.50 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 76,895.51 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 77,319.50 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 318.74 పాయింట్లు పెరిగి.. 77,042.82 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98.60 పెరిగి.. 23,311.80 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 2669 షేర్లు లాభపడ్డాయి. మరో 1,132 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ పోర్ట్స్ ఉన్నాయి. ట్రెంట్, టాటా కన్స్యూమర్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, హెసీఎల్ టెక్, విప్రో నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.4 శాతం పెరిగింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఫార్మా మినహా మిగతా అన్ని రంగాల సూచీలు మెటల్, మీడియా, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ, ఆటో 0.5 నుంచి 2.5 శాతం పెరిగాయి.


# మూడో రోజూ లాభాలే 77 వేల మార్క్ దాటిన సెన్సెక్స్



అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్టానికి దిగిరావడంతో పాటు మదుపర్లు కొనుగోళ్లపై దృష్టి పెట్టడంతో సూచీలు వరుస లాభాలను అందుకుంటున్నాయి. ఈ వారంలో తొలి రోజైన సోమవారం భారీ నష్టాలు చవిచూసిన స్టాక్ మార్కెట్లు మంగళవారం నుంచి లాభాల బాట పట్టాయి. ఈ రోజు (గురువారం) కూడా లాభాల్లోనే కదలాడాయి. ఇండెక్స్‌లో హెవీ వెయిట్ షేర్లు లాభపడుతుండడం సూచీలపై సానుకూల ప్రభావం చూపిస్తోంది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల బాటలో సాగుతున్నాయి బుధవారం ముగింపు (76, 724)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 600 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. 77, 319 వద్ద గరిష్టానికి చేరుకుంది. ఆ తర్వాత కొద్దిగా దిగి వచ్చినప్పటికీ లాభాల్లోనే కొనసాగింది. చివరకు 318 పాయింట్ల లాభంతో 77, 042 వద్ద రోజును ముగించింది. మళ్లీ 77 వేల మార్క్‌ను దాటింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే లాభాలతో రోజును ప్రారంభించింది. చివరకు 98 పాయింట్ల లాభంతో 23, 311 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఎల్ అండ్ టీ టెక్నాలజీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హెచ్‌ఎఫ్‌సీఎల్, ఇండియన్ బ్యాంక్ షేర్లు లాభాలు అందుకున్నాయి. ఒరాకిల్ ఫిన్‌సర్వ్, కల్యాణ్ జువెల్లర్, ట్రెంట్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ 584 పాయింట్ల లాభం ఆర్జించింది. బ్యాంక్ నిఫ్టీ 527 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 86.55గా ఉంది.

# రిలయన్స్ లాభం 18,540 కోట్లు

# క్యూ3లో 7.4 శాతం పెరిగిన ప్రాఫిట్




దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఆశాజనక పనితీరు కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికపు నికర లాభంలో 7.4 శాతం వృద్ధి నమోదైనట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. రిటైల్ వ్యాపారంతోపాటు టెలికం విభాగం అంచనాలకుమించి రాణించడం వల్లనే లాభాల్లో ఈ మాత్రమైన వృద్ధిని సాధించింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.18,540 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.13.70 చొప్పున ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.17,265 కోట్ల లాభం లేదా ప్రతిషేరుకు రూ.12.76తో పోలిస్తే సింగిల్ డిజిట్ వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.27 లక్షల కోట్ల నుంచి రూ.2.43 లక్షల కోట్లకు ఎగబాకింది. రూ.3.5 లక్షల కోట్లకు చేరుకున్న రుణాలకోసం సంస్థ అధికంగా చెల్లింపులు జరపడం వల్లనే లాభాలు భారీగా పుంజుకోలేకపోయాయని కంపెనీ పేర్కొంది. సెప్టెంబర్ త్రైమాసికం నాటికి కంపెనీకి రుణాలు రూ.3.36 లక్షల కోట్లు, ఏడాది క్రితం ఇదే త్రైమాసికం నాటికి రూ.3.11 లక్షల కోట్లుగా ఉన్నాయి.

**జియో లాభంలో 24 శాతం వృద్ధి**

దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో మరోసారి భారీ లాభాలను ఆర్జించింది. గత త్రైమాసికపు లాభంలో 24 శాతం వృద్ధిని సాధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.6,231 కోట్లుగా ఉన్న స్టాండలోన్ నికర లాభం గత త్రైమాసికానికిగాను 24.24 శాతం ఎగబాకి రూ.6,477 కోట్లకు చేరుకున్నది. కంపెనీ ఆదాయం రూ.25,368 కోట్ల నుంచి రూ.29,307 కోట్లకు ఎగబాకింది. డాటా వినిమయం ఊపందుకోవడం, సరాసరిగా డాటాపై వచ్చే ఆదాయం పెరగడం వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థకు 48.21 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. సరాసరి ఒక్కో కస్టమర్‌పై రూ.200 ఆదాయం సమకూరింది.

రిలయన్స్ రిటైల్ వెంచర్ లిమిటెడ్ నికర లాభం 10 శాతం వృద్ధితో రూ.3,458 కోట్లు ఆర్జించింది.

గత త్రైమాసికంలో కొత్తగా 779 స్టోర్లను ప్రారంభించింది. దీంతో మొత్తం రిటైల్ స్టోర్ల సంఖ్య 19,102కి చేరుకున్నాయి.

గత త్రైమాసికంలో రికార్డు స్థాయి ఎబిటా మార్జిన్లు ఆర్జించినట్లు, నికర లాభంలో కన్సాలిడేటెడ్ స్థాయికి చేరుకున్నది. డిజిటల్ సర్వీసులు, టెలికం సేవలకు కస్టమర్ల నుంచి విశేష స్పందన లావడం కలిసొచ్చింది.

# టైటాన్ బ్యాటరీతో రియల్‌మీ

# 14 సిరీస్ ఫోన్ల ఆవిష్కరణ.. ఇవీ స్పెషిఫికేషన్స్..!




ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ తన రియల్‌మీ 14 సిరీస్ ఫోన్లను ఆవిష్కరించింది. ఇందులో రియల్‌మీ 14 ప్రో 5జీ రియల్‌మీ 14 ప్రో ం 5జీ ఫోన్లు ఉన్నాయి. ఈ ఫోన్లు మూడు రంగుల ఆప్షన్లలో వస్తున్నాయి. గ్రే, కలర్ చేంజింగ్ పెరల్ వైట్ ఫినిష్ , బికనీర్ పర్పుల్ కలర్ ఆప్షన్లలో లభిస్తున్నాయి. రియల్‌మీ 14 ప్రోం 5జీ ఫోన్ స్నాప్ డ్రాగన్ 7ఎస్ జెన్ 3 చిప్‌సెట్, రియల్‌మీ 14 ప్రో 5జీ ఫోన్ మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ఎనర్జీ 5జీ చిప్ సెట్ బ్యాటరీలతో వస్తున్నాయి. రియల్‌మీ 14 ప్రోం 5జీ ఫోన్ 50మెగా పిక్సెల్ ప్రైమరీ సోనీ ఐఎంఎక్స్896 సెన్సర్ కెమెరాతోపాటు ట్రిపుల్ రేర్ కెమెరా సెటప్, రియల్‌మీ 14 ప్రో 5జీ ఫోన్ 80వాట్ల పాస్ట్ చార్జింగ్ మద్దతుతో 6000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తున్నది.

**రియల్‌మీ14ప్రో 5జీ సిరీస్ ఫోన్ల ధరలు ఇలా**

రియల్‌మీ 14 ప్రో 5జీ ఫోన్ 8జీబీ ర్యామ్ ం128జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.24,999, 8జీబీ ర్యామ్ ం256జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.26,999 పలుకుతుంది. ఈ ఫోన్ జైపూర్ పింక్, పెరల్ వైట్, గ్రే రంగుల్లో లభిస్తుంది. రియల్‌మీ 14 ప్రోం 5జీ ఫోన్ 8జీబీ ర్యామ్ ం128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.29,999, 8జీబీ ర్యామ్ం256జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.31,999, 12జీబీ ర్యామ్ ం256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.34,999 లకు లభిస్తుంది. ఈ ఫోన్ బికనీర్ పర్పుల్, పెరల్ వైట్, గ్రే రంగుల్లో లభిస్తుంది. అర్హత గల బ్యాంకు కార్డులపై కొనుగోలు చేసిన వారికి రూ.4,000 వరకూ క్యాష్ బ్యాక్ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఈ నెల 23 నుంచి రియల్‌మీ 14 సిరీస్ ఫోన్ల ప్రీ బుకింగ్స్ ప్రారంభం అవుతాయి. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఫ్లిప్‌కార్ట్, రియల్‌మీ ఆన్‌లైన్ స్టోర్, ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో లభిస్తాయి.

**రియల్‌మీ14ప్రోం 5జీ స్పెషిఫికేషన్స్**

రియల్‌మీ14 ప్రోం ఫోన్ ఆండ్రాయిడ్ 15 బేస్డ్ రియల్‌మీ యూఐ 6.0 వర్షన్‌పై పని చేస్తుంది. ఈ ఫోన్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్‌తోపాటు 6.83-అంగుళాల 1.5కే(1,272ఐ2,800 పిక్సెల్స్) అమోలెడ్ డిస్ ప్లే, 3840 హెర్ట్జ్ పీఎండబ్ల్యూ డిమ్మింగ్, 1500నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగి ఉంటుంది. ఈ ఫోన్ డిస్‌ప్లే కార్నింగ్ గ్లాస్ 7ఐ ప్రోటెక్షన్‌తో పని చేస్తుంది. స్నాప్ డ్రాగన్ 7ఎస్ జెన్3 ప్రాసెసర్‌పై పని చేస్తుంది. ఈ ఫోన్ 50- మెగా పిక్సెల్ 1/1.56-అంగుళాల సోనీ ఐఎంఎక్స్896 ప్రైమరీ సెన్సర్ కెమెరా విత్ ఆప్టికల్ ఇమేజ్ స్టెబిలైజేషన్, 8- మెగా పిక్సెల్ సోనీ ఐఎంఎక్స్896 అల్ట్రావైడ్ షూటర్, 50-మెగా పిక్సెల్ సోనీ ఐఎంఎక్స్882 సెన్సర్ పెరిస్కోప్ కెమెరా విత్ ఓఐఎస్ సపోర్ట్ విత్ అప్‌టూ 3ఎక్స్ ఆప్టికల్ జూమ్, 6ఎక్స్ లాస్‌లెస్ జూమ్ ఉంటుంది. సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 32- మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటుంది. రియల్‌మీ14 ప్రోం ఫోన్ 5జీ, 4జీ ఎల్టీఈ, వై-ఫై 6, బ్లూటూత్ 5.2, జీపీఎస్, గ్లోనాస్, బైదూ, గెలీలియో, క్యూజడ్ఎస్ఎస్, యూఎస్బీ టైప్-సీ పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. 80వాట్ల వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 6,000 ఎంఏహెచ్ కెపాసిటీ గల టైటాన్ బ్యాటరీతో వస్తోంది ఫోన్.

**రియల్‌మీ14ప్రో 5జీ స్పెషిఫికేషన్స్**

రియల్‌మీ14ప్రో 5జీ ఫోన్ 6.77-అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే విత్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్, 4,500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగి ఉంటుంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ కోటింగ్ ప్రొటెక్షన్ ఉంటుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ఎనర్జీ 5జీ చిప్‌సెట్‌పై పని చేస్తుంది. ఈ ఫోన్ 50- మెగా పిక్సెల్ సోనీ ఐఎంఎక్స్ 882 రేర్ కెమెరా విత్ ఓఐఎస్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16- మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. డ్యుయల్ స్పీకర్స్ విత్ హై రెస్ సర్టిఫికేషన్ కలిగి ఉంటుంది. రియల్‌మీ14ప్రోం 5జీ ఫోన్‌లో మాదిరే కనెక్టివిటీ ఆప్షన్లు ఉంటాయి. సెక్యూరిటీ కోసం ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంటుంది. 45వాట్ల చార్జింగ్ మద్దతుతో 6000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. ఈ ఫోన్‌లు కోల్డ్ సెన్సిటివ్ కలర్ చేంజింగ్ టెక్నాలజీతో రూపుదిద్దుకున్నాయి. ఉష్ణోగ్రతల్లో మార్పులకు అనుగుణంగా పెరల్ వైట్ వేరియంట్ ఫోన్ రంగులు మారుతూ ఉంటుంది. 16 డిగ్రీల సెల్సియస్ వద్ద ఫోన్ కలర్ తిరిగి వస్తుంది.

# పన్నుల భారం తగ్గించాలి

## ఇక్రా బడ్జెట్ విన్నపం




వచ్చే కేంద్ర బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) భారం తగ్గించక తప్పదని ప్రముఖ రేటింగ్ సంస్థ ఇక్రా స్పష్టం చేసింది. ఈ భారం తగ్గితే తప్ప వినియోగ వ్యయం పెరిగి జీడీపీ వృద్ధిరేటు పుంజుకునే అవకాశం లేదని పేర్కొంది. గత సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు రెండేళ్ల కనిష్ట స్థాయి 5.4 శాతానికి పడిపోయిన నేపథ్యంలో ఇక్రా ఈ హెచ్చరిక చేసింది. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో మూలధన పెట్టుబడులు కూడా రూ.11 లక్షల కోట్ల స్థాయిలో ఉండాలని సూచించింది.

**రూ.1.4 లక్షల కోట్ల లోటు :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో కేటాయించిన రూ.11.11 లక్షల కోట్ల మూలధన పెట్టుబడుల్లో రూ.1.4 లక్షల కోట్లు లోటు ఏర్పడే అవకాశం ఉందని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అది తి నాయర్ చెప్పారు. గత ఏడాది ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో మొత్తం మూలధన పెట్టుబడుల్లో 46 శాతం (రూ.5.13 లక్షల కోట్లు) మాత్రమే ఖర్చు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఆర్థిక సంవత్సరానికి రుణ సేకరణను నియంత్రిస్తూ మూలధన పెట్టుబడులు రూ.11 లక్షల కోట్ల స్థాయిలో ఉండేలా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చర్యలు తీసుకోవాలన్నారు. 4.5 శాతం ద్రవ్య లోటు సాధ్యమే : ఆదాయ వృద్ధిరేటును పరిగణనలోకి తీసుకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ద్రవ్యలోటును జీడీపీలో 4.5 శాతం వద్ద కట్టడి చేయడం పెద్ద కష్టమేమీ కాదని నాయర్ స్పష్టం చేశారు. అపుడు మూలధన పెట్టుబడుల కోసం రూ.11 లక్షల కోట్లు కేటాయించడం సాధ్యమవుతుందన్నారు.

**దిగుమతులు కట్టడి చేయాలి : ఈవై**

పడిపోతున్న రూపాయి మారకం రేటును నిలబెట్టేందుకు వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ఈవై సూచించింది. ఇందుకోసం దిగుమతులపై సుంకాలు పెంచాలని కోరింది. ఇలా చేయడం వల్ల డాలర్లకు గిరాకీ తగ్గి, రూపాయి మారకం రేటు కుదు టపడుతుందని తెలిపింది.

**పన్నుపోటు తగ్గించండి: క్రెడాయ్**

అందుబాటు ధరల (అఫర్డబుల్) గృహ ప్రాజెక్టులపై ఆదాయ పన్ను 15 శాతానికి కుదించాలని రియల్ ఎస్టేట్ రంగం కోరింది. అలాగే ఈ తరహా ప్రాజెక్టులు చేపట్టే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరింది. అలాగే అందుబాటు ధరల గృహ నిర్వచనాన్నీ ప్రస్తుతం రూ.45 లక్షల నుంచి మరింత పెంచాలని విజ్ఞప్తి చేసింది.

**టూ వీలర్లపై జీఎసటీ తగ్గించాలి : హీరో మోటోకార్ప్**

కనీసం 125 సీసీ వరకు సామర్థ్యం ఉన్న ద్విచక్ర వాహనాలపై జీఎస్ టీని 28%నుంచి 18% స్థాయికి కుదించాలని హీరో మోటోకార్ప్ కోరింది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332